# రాజకీయమా...నీకు జోహార్

**-కైపు ఆదిశేషారెడ్డి**

రాష్ట్రంలో 'రాజకీయం' ఉలిక్కిపడి లేచింది. నిన్నటిదాకా ఎలాంటి స్పందనలేని రాజకీయ లోకం ఒక్కసారిగా జూలు విదిలించుకుని వురకల మీద వురకలు వేస్తూ పరుగు అందుకుంది. రాజకీయం అలా ఉలిక్కిపడి వురకలెత్తడానికి కారణం లేకపోలేదు. ఆర్నెల్లు ముందుగానే అసెంబ్లీని రద్దుచేసి ముందస్తు ఎన్నికలకు సిద్ధం కావాలంటూ మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది.

హైటెక్ సాంకేతిక పరిజ్ఞానంతో రాజకీయాన్ని వడబోసి తీసుకున్న నిర్ణయాన్ని మంత్రివర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది. అంతే... కాంట్రాక్ట్ పనులు చేస్తూ పొరుగు రాష్ట్రాలకు వెళ్లినవారు, విశ్రాంతి కోసం విదేశాలకు వెళ్లినవారు, టైముంది కదాని తీరిగ్గా సొంత పనుల్లో బిజీగా అయిన మాజీలు తమ తమ వర్గాలకు పరుగులు తీసారు తమ తమ వర్గాలు జారిపోకుండా చూసుకునేందుకు.

సిట్టింగ్ ఎటూ టచ్‌లో వున్నారు కాబట్టి పెద్దగా టెన్షన్ పడకపోయినా సీటు నిలబెట్టుకునే ఆలోచనల్లో పడ్డారు. మధ్య తరగతివారు 'ఇదెక్కడి మధ్యంతరం గోలరా బాబూ' అంటూ విసుక్కుంటే బిలో పావర్టీ మాత్రం ఎగిరి గంతేసింది. ఎన్నికలొచ్చాయంటే వారికి పండుగే మరి. చుట్టూ తిరిగి తినిపించేవాళ్ళు, తాపించేవాళ్ళుంటారు. కాబట్టి దిగుల్లేని తిండి, అంతులేని ఆనందం. 'పండగొచ్చిందిరా తమ్ముడూ' అంటూ పాడుకోసాగారు.

సిద్ధాంతపరమైన అవగాహనతోనూ, అవకాశవాద ఆలోచనలతోనూ రాజకీయ పార్టీల మధ్య సర్దుబాటు చర్చలు ప్రారంభమయ్యాయి.

చిన్నా చితక పార్టీలు కొన్ని అధికార పక్షంతోనూ, మరికొన్ని ప్రతిపక్షంతోనూ జోడీ కట్టాయి. ఈలోగా ఎన్నికల కమీషన్ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించింది. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది.

***

'ఆ' నియోజకవర్గంలోనూ రాజకీయ వాతావరణం చోటు చేసుకుంది. మిడిల్ క్లాస్, లోయర్ క్లాస్ నాయకుల్లో ఉత్సాహం వుపందుకుంది. సిట్టింగ్ ఎమ్మెల్యే చెంగల్రావు అధికార పార్టీకి చెందినవాడే. మళ్లీ టిక్కెట్ గ్యారెంటీతో జనాల్లోకెళ్లి ప్రచారం మొదలుపెట్టాడు.

ప్రతిపక్ష పార్టీ తరపున రెండుసార్లు ఓటమిపాలైన నీలకంఠం మళ్లీ ఈసారి టిక్కెట్ తనదేననే ధీమాతో అనుచరగణాన్ని ఉత్తేజపరుస్తూ ఎలాగైనా గెలిచి తీరాలనే పట్టుదలతో ఉన్నాడు. అంతేకాక టిక్కెట్ కోసం పైరవీలు కూడా ఓవైపు కొనసాగిస్తూనే ఉన్నాడు. అయితే ఈసారి నీలకంఠానికి ఒక బడా పారిశ్రామికవేత్త టిక్కెట్‌కి అడ్డుపడే ప్రయత్నంలో రాజధానిలో పావులు కదుపుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న నీలకంఠం హడావుడిగా రాజధాని చేరాడు.

గెలిచే సంగతి ఎలావున్నా టిక్కెట్ తెచ్చుకునే విషయంలో పోటీ మొదలైంది. జనాలచేత ఓట్లేయించుకుని గెలవడం ఒక ఎత్తయితే అధిష్టానాన్ని తృప్తిపరచి టిక్కెట్ సాధించడం పెద్ద సవాల్‌గా మారింది. టిక్కెట్ కోసం పైరవీలతోపాటు పైకం మూటలు తప్పనిసరి అయింది.

నామినేషన్ల పర్వం ప్రారంభమైంది. గడువు దగ్గరపడుతున్నకొద్దీ టిక్కెట్లు ఆశించేవారిలో టెన్షన్ పెరుగుతోంది. టిక్కెట్ కేటాయింపుల్లో రాష్ట్ర నాయకులు తలమునకలైనారు. రోజూ కొందరి పేర్లు ప్రకటిస్తున్నారు. ప్రకటించినవారు పరుగెత్తుకెళ్లి హడావుడిగా మందీమార్బలాల్ని వెంటేసుకుని హంగామా నామినేషన్లు వేస్తున్నారు.

'ఆ' నియోజకవర్గానికి చివరి సమయంలో రెండు పార్టీలు తమ తమ అభ్యర్థుల పేర్లను ప్రకటించాయి. అందరూ అనుకున్నట్లుగానే అధికార పార్టీ అభ్యర్థి, సిట్టింగ్ చెంగల్రావుకే మళ్లీ టిక్కెట్ వచ్చింది. రెండుసార్లు ఓడిపోయాడనే సాకుతో ప్రతిపక్ష పార్టీ నీలకంఠానికి మొండిచెయ్యి చూపించింది. తెరమీదకి కొత్త ముఖం వచ్చింది. నిన్నటివరకూ సాధారణ జనానికి తెలియని వ్యక్తి, బడా కాంట్రాక్టర్, ఎక్కడో మహారాష్ట్రలో కాంట్రాక్ట్ పనులు చేస్తున్న రాఘవేంద్రకు టిక్కెట్ ఇచ్చారు. రాత్రికి రాత్రే రాఘవేంద్ర తాలూకు మనుషులు కార్లు, లారీలు, సంచులతో దిగేసారు. నీరుగారిపోయిన నీలకంఠాన్ని కలిసారు. ఎగిరిపడిన నీలకంఠం వారిని గెంటేసినంత పని చేసి ఇండిపెండెంట్‌గా రంగంలోకి దిగి నామినేషన్ వేసాడు. నిన్నటిదాకా నియోజకవర్గాన్ని అంటిపెట్టుకుని ఉన్న తనని కాదని ముక్కూ మొహం తెలియని వారికి టిక్కెట్టు ఇవ్వడం అన్యాయమైన పని అనీ, తనకి అవమానమైందనీ పత్రికల ముందు వెలుగెత్తి చాటాడు.

***

నామినేషన్ల ఘట్టం పూర్తయింది. ఉపసంహరణల సమయం దగ్గర పడుతోంది. దాదాపు అన్నీ పార్టీలు రెబల్స్ బాధను ఎదుర్కొంటున్నాయి. రెబల్ అభ్యర్థులంతా నామినేషన్ విత్‌డ్రా చేసుకుని అధికార పార్టీ అభ్యర్థికి మద్దతునివ్వాలని ప్రకటించాయి. అనేకచోట్ల బుజ్జగింపులు, బెదిరింపులు, కొనుగోళ్ళు పని చేసాయి. రెబల్స్ సర్దుకుని జనంలోకి రాసాగారు.

'ఆ' నియోజకవర్గంలో కూడా అధిష్టానం ఒత్తిడి, కాంట్రాక్టర్‌గారి 'చల్లని చూపుల' మహిమతో నీలకంఠం పోటీ నుండి తప్పుకున్నట్లు ప్రకటించాడు. నామినేషన్ విత్‌డ్రా చేసుకుని రాఘవేంద్రతో కలసి జీపెక్కాడు.

ప్రచార హోరు మొదలైంది. సభలు, సమావేశాలు, ఇంటింటి ప్రచారాలు వూపందుకున్నాయి. ఎవరికివారు తమదైన ప్రణాళికలు రూపుదిద్దుకోవడంలో నిమగ్నమయ్యారు.

పోలింగ్ మరో రెండురోజులు ఉందనగా 'ఆ' నియోజకవర్గ అధికార పార్టీ నాయకుడైన చెంగల్రావు ఇంట్లో కీలకమైన అనుచరులు సమావేశమయ్యారు.

"మిత్రులారా! గత రెండుసార్లు నీలకంఠం కాబట్టి మనం టెన్షన్ పడకుండా నెట్టుకొచ్చాం. ఈసారి పోటీలో ఉండే వ్యక్తి సామాన్యుడుకాదు. ధనబలంతోపాటు గూండాయిజం పుష్కలంగా ఉన్నోడు. మన నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా జరగవనిపిస్తోంది. రాఘవేంద్ర దౌర్జన్యానికి, రిగ్గింగ్‌కూ పాల్పడవచ్చు" అన్నాడు చెంగల్రావు అక్కడ చేరిన తన అనుచరులతో.

"నిజమే అన్నా... నాకూ అదే డౌటు వచ్చింది. నీలకంఠంలాగా ఈయనేం పెద్దమనిషి కాదు. మీరన్నట్లు గొడవలు జరగొచ్చని జనాలు కూడా చెప్పుకుంటున్నారు. ఆయన మనుష్యులు కొంతమంది ఇటీవల బాంబులకోసం రాయలసీమకు వెళ్లినట్లు వినికిడి'' తను విన్నది బయటపెట్టాడో మధ్య స్థాయి నాయకుడు.

ఆ సమావేశంలో అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నారు. తాము కూడా ప్రతిపక్షానికి ధీటుగా ఏర్పాటు తీసుకోవడానికి రంగం సిద్ధమైంది. బాంబులు విసరడానికి, రిగ్గింగ్ చేయడానికి బాగా అనుభవమున్న కిరాయి గూండాల కోసం గాలింపు మొదలైంది.

జనాలు వేసే ఓట్లకన్నా రిగ్గింగ్ ఓట్లే ఈసారి కీలకం అనేది వారి ఆలోచన.

చెంగల్రావు ఇంట్లో జరిగిన కీలకమైన సమావేశం గురించి తన ప్రత్యేక వ్యక్తుల ద్వారా తెలుసుకున్నాడు రాఘవేంద్ర. రాజకీయాన్ని కూడా పక్కా వ్యాపార దృష్టితో చూస్తున్న రాఘవేంద్ర మరికొన్ని జాగ్రత్తలు తీసుకోవడంలో నిమగ్నమయ్యాడు.

ఎన్నికలు దగ్గరపడుతున్నకొద్దీ ప్రచార హోరు కన్నా చాపక్రింద నీరులా డబ్బు, మద్యం విచ్చలవిడిగా సరఫరా అవుతోంది. రెండు పార్టీల మద్దతుదారులు అందినంత డబ్బు, దొరికినంత మద్యం స్వాహా చేయసాగారు.

గత రెండుసార్లు పెద్దగా డబ్బు ఖర్చు పెట్టని చెంగల్రావుకి ఈసారి చుక్కలు కనిపిస్తున్నాయి.

రాఘవేంద్రకి మొదటి ఎన్నికలు. ఎంత లాగినా బ్లాక్‌మనీకి మించదు. అందుకే ఖర్చులో రాజీపడడంలేదు, జంకడంలేదు.

నీలకంఠానికి టిక్కెట్ పోయిందనేగానీ ఎమ్మెల్యేగా ఐదేళ్లపాటు సంపాదించుకోలేనంత మొత్తం ఈ పదిరోజుల్లోనే మిగుల్చుకున్నాడు. సంచులు సంచులుగా మహాలక్ష్మి ఇంట్లోకొచ్చి వాలుతోంది.

★★★

ఎలక్షన్ రోజు రానే వచ్చింది. పోలీసుల, పరిశీలకుల కళ్ళుకప్పి ఓట్లకి నోట్ల పంపిణీ జరిగిపోయింది.



కొన్నిచోట్ల ఓడేస్తే ఓటుకింత అని పంచితే, మరోచోట ఓటుకు రాకపోతే ఓటుకింత అని రేటు పెట్టి మరీ పంపకాలు జరిగిపోయాయి. ఇలాంటి అనుభవాలు చూడని జనాలు ఆనందపడ్డారు. 'అవకాశం వచ్చినప్పుడే అందుకోవాలనే' సామెత ప్రకారం ఎవరు ఎంతిచ్చినా, ఏదిచ్చినా వద్దనకుండా పుచ్చుకుని 'మా ఓట్లు మీకే' అని అనడం నేర్చుకున్నారు.


యథావిధిగా షెడ్యూల్ ప్రకారం ఓటింగ్ ప్రక్రియ పూర్తయింది. రాష్ట్రమంతా ఎలావున్నా 'ఆ' నియోజకవర్గంలో మాత్రం బాంబుల మోత, రిగ్గింగ్‌లు, బూత్ ఆక్రమణలు, ఏజెంట్ల గల్లంతు, అక్కడక్కడ కాల్పులు, గాయాలు.. నేపథ్యంలో ముగిసింది. అయినా సాయంత్రానికి 'పోలింగ్ ప్రశాంతంగా' ముగిసినట్లు అధికారుల డిక్లరేషన్.

ఎవరు ఓట్లు వేసారో, ఎవరు ఎవరికి వేసారో! మొత్తానికి ఫలితాన్ని కడుపులో పెట్టుకుని బ్యాలెట్ బాక్సులు తాపీగా కౌంటింగ్ సెంటర్లకి చేరాయి. నిండుకుండలా తొణకక సీరియల్ వరుసలో కూర్చుండిపోయాయి.



## వాడి-వేడి చర్చ

సినిమారంగంలోకి వచ్చాక మాటలు బాగా నేర్చుకుంటూ ఉంటారు భామలు. ఇప్పుడు దీపల్‌షా కూడా మాటకారిగా మారిపోయింది. హెచ్‌బిఓలో ఆమె నటించిన సినిమా ప్రీమియర్‌కి సంబంధించిన డిస్కషన్ వేడిగా సాగిందిట. 'నా గురించి నాకు తెలుసు. నేను నటించిన సినిమాలు చూస్తే నా వ్యక్తిత్వం మీకు అవగతం అవుతుంది. మంచి చిత్రాల్లో నటించి అందర్నీ మెప్పించాలని నా కోరిక. ఆ కోరిక ఇప్పుడిప్పుడే నెరవేరుతోంది' అంటోంది దీపల్‌షా. మొత్తానికి ఈ చిలక మాటలు బాగానే నేర్చిందన్న మాట.




అలసిపోయిన అభ్యర్థులు తమ ఇళ్లకుపోయి రెస్టు తీసుకున్నారు. నిన్నటి దాకా ఖుషీ చేసుకున్న జనాలు డీలా పడి కొంపలకి చేరుకున్నారు.

ఎన్నికల షెడ్యూలు ప్రకారం పోలింగ్‌కూ, కౌంటింగ్‌కూ మధ్య వారం గడువుంది. దాంతో ఆ నియోజకవర్గంలో ఉబుసుపోని కబుర్లు, కాకిలెక్కలు మొదలయ్యాయి. ఛోటా, మిడిల్ స్థాయి నాయకులంతా వారి వారి నాయకుల దగ్గరకు చేరారు. బూత్‌వైజ్ లెక్కలు మొదలైనాయి. ప్రతి బూత్‌లో తమకి ఎన్ని పడ్డాయో, అవతలవారికెన్ని పడ్డాయో కాకి అంచనాలు వేసారు. అయితే విచిత్రమేమిటంటే రెండు శిబిరాల్లోనూ ఆనందమే. ప్రతి శిబిరంలోనూ లెక్కలు వారికి మెజారిటీతోనే చూపించాయి మరి. ఎవరికి వారు ఐదు వేల మెజారిటీతో గెలుస్తామనే ధీమాతో ఉండిపోయారు. 'బిడ్డ చచ్చినా పురిటి కంపు పోనట్టు' ఎన్నికలు ముగిసినా ఈ వారంరోజులపాటు మళ్లీ ఖర్చులు తప్పలేదు.

***

అనుకున్న రోజు రానే వచ్చింది. కౌటింగ్ ప్రారంభమైంది. ఫలితాల ప్రకటనలో మీడియా వేగవంతంగా పని చేస్తోంది. ఎప్పటికప్పుడు ట్రెండ్స్, ఫలితాలు ప్రకటించసాగాయి. పొద్దుపోయేకొద్దీ వస్తున్న ఫలితాల సరళి ప్రతిపక్ష పార్టీకి అనుకూలంగా మారసాగింది. కోరి ముందస్తు పెట్టుకున్న అధికార పార్టీ నాయకులంతా గల్లంతవసాగారు. రాష్ట్రస్థాయి సీను అలా వుంటే మరి 'ఆ' నియోజకవర్గంలో అందర్నీ ఖంగు తినిపించేట్లుగా అధికార, ప్రతిపక్ష సభ్యులిద్దరి జాతకాలు గల్లంతయ్యాయి. ఎవరూ ఊహించని విధంగా ఏనుగు గుర్తుపై పోటీ చేసిన ఇండిపెండెంట్ అభ్యర్థి బంగారయ్య విజయం సాధించాడు.

రెండు శిబిరాల అంచనాలు గల్లంతు కావడంతో నెత్తిన బట్టలేసుకుని ఎవరి కొంపలకి వారు చేరారు. చెంగల్రావు కొంప కొల్లేరుకాగా, రాఘవేంద్ర శిబిరం పులికాట్ అయింది. రెండు క్యాంపులు 'శవం లేచిన ఇళ్ళు'లా శోకసముద్రంలో మునిగిపోయాయి. అయితే మూడోచోట నీలకంఠంగారింట్లో గంట గంటకి జోరు, హోరు పెరగసాగింది. ఆదరాబాదరా వచ్చిన బంగారయ్య నేరుగా నీలకంఠం కాళ్ళు కళ్లకద్దుకున్నాడు.

"సారూ! తమరు పెట్టిన భిక్ష ఇది. ఈ జన్మకి మీ మేలు మర్చిపోను" అన్నాడు.

"బంగారయ్యా! నీ కోరిక తీరిందయ్యా. బడా కాంట్రాక్టర్లని రంగంలోకి దించి నాలాంటి నమ్మకస్తులకు చివరి దశలో హేండిచ్చే పార్టీ నాయకత్వానికి బుద్ధి రావాలి. ఓడిపోయినా పది సంవత్సరాలపాటు నియోజకవర్గాన్ని కనిపెట్టుకుని వర్గాన్ని కాపాడుకోవడానికి పడరాని పాట్లు పడిన వారిని తుంగలో తొక్కి అడ్డగోలుగా రాత్రికి రాత్రే మూటలతో వచ్చే బడా కాంట్రాక్టర్లకు, వ్యాపారస్తులకు సీటు ఎలా ఇస్తారయ్యా. అందుకే దెబ్బకి దెబ్బ తీసాం" అన్నాడు నీలకంఠం.నిన్నటిదాకా రెండు శిబిరాల్లోనూ నాయకులుగా చలామణి అయిన తన అనుచరులంతా కేరింతలు కొట్టారు. పండుగ చేసుకున్నారు ఖుషీఖుషీగా.

టిక్కెట్ రాకపోయేసరికి నీలకంఠానికి చెందిన కొందరు తనవైపు వచ్చార్లే అనుకుని చెంగల్రావు, విత్‌డ్రా చేసుకున్నాడు కాబట్టి ఆయన వర్గం తనతో కలసిపోయిందని రాఘవేంద్ర నమ్మారు. అలా నమ్మడమే వారు చేసిన పొరపాటు.

రెండు శిబిరాల్లోని తన వర్గం ఎప్పటికప్పుడు వారి ఎత్తులు, జిత్తులు తనకి తెలియజేస్తూ ఉండేవారు. దానికి తగ్గట్టు తన ప్లాను చేసుకునేవాడు. చివర్లో రెండు శిబిరాలు భారీ ఎత్తున రిగ్గింగ్‌కి దిగాలనుకోవడంతో నీలకంఠం ప్లాన్ సక్సెస్ అయింది. సిసలైన 'రాజకీయం అంటే ఇదే' అని నిరూపించాడు.

రెండువర్గాల్లో రిగ్గింగ్‌కి దిగిన గూండాలందరూ లోపాయికారిగా నీలకంఠం మనుషులే. ఇంకేముంది... నీలకంఠం అభ్యర్థి బంగారయ్య గుర్తుకు మహర్దశ పట్టింది. చివర్లో బద్దలైన బాక్సులు ఆ నిజాన్ని గుప్పుమనిపించాయి.

★